ఎస్ఐఎస్ వివరాల ఆన్‌లైన్‌లో వేగం పెంచాలి: కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 24 : జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే వివరాలు ఆన్‌లైన్ చేయడంలో వేగం పెంచాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఎస్ఐఎస్ వివరాల ఆన్‌లైన్‌పై అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర అధికారులతో కలిసి ఆదివారం కలెక్టరేట్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పూర్తి పారదర్శకతతో డాటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని, ఎన్యుమరేటర్ సర్వే బ్లాకులు, సర్వే జరిగిన వివరాల క్రమంలో సమాచారాన్ని పొందుపర్చాలన్నారు. ఏవైనా సందేహాలు, సలహాల కోసం జిల్లాలో టోల్ ఫ్రీ నంబర్ 18004254731లో సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ మాట్లాడుతూ, తాళం వేసి ఉన్న ఇళ్లకు రెండు, మూడు సార్లు వెళ్లి తనిఖీ చేయాలన్నారు. హౌస్ లిస్టింగ్ చేసిన ఇళ్ల సర్వే పూర్తి చేశారా లేదా తెలుసుకోవాలన్నారు. కాగా, సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న క్రమాన్ని ఆదివారం ఉదయం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ పమేలా సత్పతిని అడిగి తెలుసుకున్నారు. సమీక్షా సమావేశంలో జడ్పీ సీఈవో వెంక టేశ్వర్లు, సీపీవో కొమురయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన

ఉచిత వైద్యశిబిరంలో వైద్యబృందంతో ప్రజాప్రతినిధులు, తదితరులు

విద్యానగర్, నవంబర్ 24: స్థానిక 15వ డివిజన్‌లోని ప్రతిమ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఈ సందర్భంగా 14వ డివిజన్ రాంనగర్, 15వ డివిజన్ మార్కండేయనగర్, ప్రగతినగర్ పరిధిలోని టెలిఫోన్ క్వార్టర్స్ ప్రజలు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేశ్, ప్రతిమ హాస్పిటల్ క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ జే సంపత్‌రావు, 15వ డివిజన్ నీనియర్ నాయకులు, సుడా మాజీ డైరెక్టర్, ప్రగతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చీటి రాజేందర్‌రావు, పల్లవి స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షుడు వొడ్నాల రాజు, కరీంనగర్ విశ్రాంత తహసీల్దార్ శ్రీహరిరెడ్డి, ప్రతిమ హాస్పిటల్ డాక్టర్ గీతారెడ్డి, వైద్య సిబ్బంది, 14, 15వ డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని వినతి

తెలంగాణచౌక్, నవంబర్ 24: నగరంలోని జ్యోతిబాపూలే మైదానంలో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు ఆదివారం నగరంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీ బిడ్డగా పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే, బీసీ కులాల సంక్షేమ భవన నిర్మాణం కోసం స్థలంతో పాటు నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు బీసీ సంఘం నాయకులు తెలిపారు.

రాజన్న కోడెలకు వరిగడ్డి వితరణ

గంగాధర, నవంబర్ 24 : మధురానగర్ గ్రామానికి చెందిన తూము రాజ్‌కుమార్ తన తండ్రి మల్లారెడ్డి జ్ఞాపకార్థం వేములవాడ రాజరాజేశ్వర స్వామి గోశాలలోని కోడెల కోసం ట్రాక్టర్ గడ్డిని పంపించాడు. ఇక్కడ గ్రామస్తులు పెరుక మహేశ్, వేముల కిశోర్, తూము కుణాకర్, తూము వినయ్ తదితరులు ఉన్నారు.

ఎస్సారార్ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్, తదితరులు

సెయింట్ జార్జ్‌లో ఆకట్టుకున్న విద్యార్థుల పిరమిడ్ విన్యాసం

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవ సంబురాలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24 : జిల్లాలో ఎన్‌సీసీ దినోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకృష్ణ మాట్లాడుతూ, జీవితంలో క్రమశిక్షణకు, ఉన్నతంగా ఎదుగుదలకు ఎన్‌సీసీ ఎంతో దోహద పడుతుందని చెప్పారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ రేల్ల సంజీవ్ మాట్లాడుతూ, ఎన్‌సీసీ నాయకత్వ లక్షణాలు పెంచుకునేందుకు తోడ్పడుతుందన్నారు. అలాగే, వివేకానంద డిగ్రీ కళాశాలలో వేడుకలు ఆకట్టుకున్నాయి. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఏసీవో సంపత్ కుమార్, ఏవో శ్రావణ్ కుమార్, కెప్టెన్ కన్నెగంటి కిరణ్ జ్యోతి, అధ్యాపకులు, కెడెట్లు ఉన్నారు.

కొత్తపల్లి, నవంబర్ 24: కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ విద్యార్థులు శ్రమదానం, మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ డా. ఫాతిమారెడ్డి మాట్లాడుతూ, ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ, జాతీయ భావం అలవడుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ శిక్షకురాలు దివ్య పాల్గొన్నారు.

చొప్పదండి, నవంబర్ 24: మండలంలోని రుక్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ శిక్షణ పాఠశాలలో ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా కెడెట్స్ స్వచ్ఛభారత్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు. అంతకు ముందు అవగాహన సదస్సులో డైరెక్టర్ కేసీ రావు, ప్రిన్సిపాల్ శ్రీ కాళహస్తి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఎన్‌సీసీ ద్వారా దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ చిరంజీవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డుకాలనీ, నవంబర్ 24: ఎన్‌సీసీ డే సందర్భంగా కార్ఖానాగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కెడెట్లు ప్రభుత్వ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కే త్రివేణి, వృద్ధాశ్రమ నిర్వహణ అధికారి రాధిక, పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, నవంబర్ 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న నగరంలో నిర్వహించే భారీ నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో పలు వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26న చేపట్టిన నిరసన కార్యక్రమంలో అన్ని కార్మిక, కర్షక సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో ఈ- సేవా కేంద్రం ప్రారంభం

ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 24: దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ కోర్టులోని ఈ సేవా కేంద్రాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహులు ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం హుజూరాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పీ అలేఖ్య లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ, ఈ-సేవా కేంద్రాల్లో కక్షిదారులు తమ కేసుల వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. న్యాయవాదులు సైతం వీటిద్వారా తమ కేసులు దాఖలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మొదటి, రెండో మెజిస్ట్రేట్‌లు పద్మ సాయిశ్రీ, స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోస్కుల శ్రీనివాస్, సెక్రటరీ తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ రమేశ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

భవిష్యత్తులో ప్రాంతీయ పార్టీలకే ఆదరణ

సైదాపూర్, నవంబర్24: రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలకే ప్రజల ఆదరణ ఉంటుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు.

దాశరథి తాత్వికతకు దర్పణం 'అగ్నిధార'

కార్యక్రమంలో పాల్గొన్న కవులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24 : అగ్నిధార కవితా సంపుటి దాశరథి జీవన తాత్వికతను ప్రతిబింబిస్తుందని ప్రముఖ సాహిత్య విమర్శకుడు దర్భశయనం శ్రీనివాసాచార్య పేర్కొన్నారు. తెలంగాణ రచయితల వేదిక(తెరవే) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో జరిగిన దాశరథి అగ్నిధార అవగాహన సదస్సులో ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. లౌక్యం తెలియని అమలిన ఆణిముత్యం దాశరథి అని కొనియాడారు. కవి విశేషాలను దర్భశయనం వివరించారు. అగ్నిధార అవగాహన సభకు తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో దామరకుంట శంకరయ్య, రామానుజం సుజాత, జనగాని యుగంధర్, గుండు రమణయ్య, గాజోజు నాగభూషణం, విలాసాగరం రవీందర్ మాట్లాడారు. డాక్టర్ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు సహా అరవై మంది కవులు హాజరయ్యారు.

ఏఐపీవైఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

నూతన కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రం ఇస్తున్న సుధీర్

శంకరపట్నం, నవంబర్ 24: మండలంలోని ముత్తారం గ్రామంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కమిటీని మండలాధ్యక్షుడు ఎల్కపెల్లి సుధీర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకం కర్ణాకర్, ఉపాధ్యక్షులుగా కనకం ఆదిత్య, షేక్ ఫారూఖ్, ప్రధాన కార్యదర్శిగా కనకం విజయ్, కోశాధికారిగా కనకం ప్రదీప్, సహాయ కార్యదర్శులుగా కనకం మహేశ్, నెలవేని ఆదిత్య, కార్యవర్గ సభ్యులుగా ఎల్కపెల్లి కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు కృషి: మేయర్

17వ డివిజన్‌లో మురుగు కాలువను పరిశీలిస్తున్న మేయర్

కార్పొరేషన్, నవంబర్ 24: నగరంలోని 17వ డివిజన్‌లో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఆదివారం 17వ డివిజన్‌లోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో పర్యటించారు. నగరపాలక సంస్థ ద్వారా గతంలో నిర్మించిన మురుగు నీటి కాలువ ద్వారా మురుగు నీరు ప్రవహించి పెద్ద సమస్యగా మారిందని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని డివిజన్లలో దాదా 90 శాతం పనులు పూర్తి చేసి సుందర నగరంగా మార్చామన్నారు. వచ్చే నిధుల లభ్యతను బట్టి పెండింగ్ పనులు కూడా త్వరలోనే పూర్తి చేసి సమస్యలు లేని నగరంగా మార్చుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, స్థానిక ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24 : జిల్లా కేంద్రంలో నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్-2024) అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, మొత్తం 1451 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1395 మంది హాజరయ్యారని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి మూడు పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రెండు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు మూడు పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపికకు స్పందన

కొత్తపల్లి, నవంబర్ 24 : జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, వేంపేట, సుల్తానాబాద్, పెద్దపల్లి, కాటారం, మంథని, కరీంనగర్, ఇల్లంతకుంట, కోరుట్ల, చొప్పదండి, జగిత్యాల తదితర ప్రాంతాల నుంచి 85 మంది మహిళలు, 70 మంది పురుష క్రీడాకారులు హాజరయ్యారు. కరీంనగర్ డైట్ లెక్చరర్ లక్ష్మీరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు పోటీల నిర్వహణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ సభ్యులు చిట్టి తిరుపతిరెడ్డి, కుమారస్వామి, వంగపల్లి సూర్యప్రకాశ్, కట్ట సంతోష్, కరుణాకర్, డీ ప్రసాద్, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, పండుగ ఆనంద్, వెంకటేశ్, జలంధర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా సహకార శాఖ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గం

విద్యానగర్, నవంబర్ 24: కరీంనగర్ జిల్లా సహకార శాఖ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ కార్యవర్గం ఎన్నికలను ఆదివారం డీసీవో ఎస్ రామాంజనేయా చార్యుల ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి ఎన్ రాజయ్య నిర్వహించారు. అధ్యక్షుడిగా సీహెచ్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం. లక్ష్మణాచారి, కార్యదర్శిగా ఎం. శ్యామ్‌సుందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కే జమునారాణి, డైరెక్టర్లుగా వి. నర్సయ్య, మహ్మద్ జలాలుద్దీన్ అక్బర్, పి. సురేందర్‌రెడ్డి, మహ్మద్ అసద్, టీ రాజేంద్రప్రసాద్, బి. రాములు, కె. రవికుమార్, మహ్మద్ గయాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సహకార శాఖ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీవోప నూతన కార్యవర్గం

నూతనంగా ఎన్నికైన డివిజన్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు

కొత్తపల్లి, నవంబర్ 24: తెలంగాణ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా చంద్రకళ, ఎం వీణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రామకృష్ణ ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన వారిని టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణ్‌రావు అభినందించారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు కాళీచరణ్, టీఎన్జీవో సంఘం సహాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, రాజేశ్ భరద్వాజ్, గంగారపు రమేశ్, పోలు కిషన్, కరుణాకర్, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారమితలో ఆకట్టుకున్న నేషనల్ రేసింగ్ డే వేడుకలు

పారమితలో జరిగిన నేషనల్ రేసింగ్ డేలో పాల్గొన్న విద్యార్థులు

కొత్తపల్లి, నవంబర్ 24 : పారమిత పాఠశాలలో 76వ నేషనల్ రేసింగ్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాఠశాల హెచ్ఎం బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కెడెట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నేషనల్ రేసింగ్ డేను పురస్కరించుకొని పట్టణంలోని కేర్ నియో హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్‌లో అనాథ పిల్లల ఆశ్రమానికి వారం రోజులకు సరిపడే నిత్యావసరాలు, పుస్తకాలు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం

కరీంనగర్ రూరల్, నవంబర్ 24: కార్తీక మాసం సందర్భంగా నగునూర్ గ్రామంలోని పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక మాస లక్ష దీపోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ధర్మాధికారి, వేదపండితుడు పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ వంగళ లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, కార్పొరేటర్ వంగల శ్రీదేవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీ ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రసాయన శాస్త్రంలో దాసరి రఘుకు డాక్టరేట్

దాసరి రఘు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24 : రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనలకు గానూ జగిత్యాల జిల్లా మోతె గ్రామానికి చెందిన దాసరి రఘుకు శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య శ్రీరంగ ప్రసాద్ డాక్టరేట్ ప్రకటించారు. దాసరి రఘు రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు వీ నమ్రత పర్యవేక్షణలో 'డిజైన్, సింథసిస్, కారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్' అంశంపై పరిశోధన పూర్తి చేశారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న బస్సు

శంకరపట్నం, నవంబర్ 24: మండలంలోని వంకాయగూడెం శివారు అయ్యప్ప కాలనీ వద్ద ఆగి ఉన్న కారును హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ టూరిస్ట్ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసం అయింది. కారులోని అయ్యప్ప దీక్షాపరులు కేశవపట్నం గ్రామానికి చెందిన చింతం సత్యనారాయణ, కాటం వెంకటరమణారెడ్డి, గొట్టిముక్కల సుధాకర్ సురక్షితంగా బయటపడ్డారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన పుల్లూరి నాగార్జున్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కే రవి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

గంగాధర, నవంబర్ 24 : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండల కేంద్రానికి చెందిన పొన్నాల అంజయ్య ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి అన్నదానం

కమాన్‌చౌరస్తా, నవంబర్ 24: జిల్లా కేంద్రంలోని హరిహరక్షేత్రం అయ్యప్ప ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగానే దేవాదాయ శాఖ, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమం జనవరి 8వ తేదీ వరకు ప్రతి రోజూ కొనసాగుతుందని తెలిపారు. అలాగే, డిసెంబర్ 1 నుంచి జనవరి 1 వరకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు తమకు తోచిన విధంగా విరాళం అందించి సహకరించాలని కోరారు.

మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ

రాంనగర్, నవంబర్ 24: ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు కలకుంట్ల హన్మంతరావు మృతి బాధాకరమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో హన్మంతరావు నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సంతోష్, నాయకులు ఉన్నారు.

వర్ధంతి సభకు హాజరైన మంత్రి సీతక్క

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 24: పట్టణానికి చెందిన గుర్రం హరిబాబు తండ్రి వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతి సభకు రాష్ట్ర మంత్రి సీతక్క హాజరయ్యారు. వెంకటేశ్వర్లు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

భవన నిర్మాణ సంఘం గ్రామ కార్యవర్గం ఎన్నిక

శంకరపట్నం, నవంబర్ 24: మండలంలోని ముత్తారంలో ఆదివారం ఏఐటీయూసీ భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య ఆధ్వర్యంలో నూతన గ్రామ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూనె రమేశ్, కార్యదర్శిగా రేగుల కుమార్, కోశాధికారిగా పల్లె రమేశ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆళ్ల ధనంజయ్, పొన్నాల లక్ష్మణ్, మంద చంద్రమౌళి, బండారి భాస్కర్, కొలిపాక రాజలింగం, నూనె ఐలయ్య, నూనె సదయ్య, లేగల రాజయ్య, చంద్రయ్య, బండి చంద్రయ్య, కొలిపాక శంకర్, సుద్దాల చంద్రయ్య, నూనె సమ్మయ్య ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

మానకొండూర్ రూరల్, నవంబర్ 24: అక్టోబర్‌లో ఈదుల గట్టెపల్లి గ్రామంలో కరెంటు షాక్‌తో ఇంట్లో మంటలు చెలరేగి, మంటల్లో అంగిడి రాజ్ కుమార్ కుమారుడు సాయికుమార్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం ఆదివాసి ఎరుకల తెగ (కుర్రు) ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మొగిలి లచ్చయ్య, సంఘం సభ్యులు పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. వీరి వెంట ప్రధాన కార్యదర్శి వొలగుత్తుల పోచయ్య, సభ్యులు రెవెల్లి రాజయ్య, మానుపాటి రాజయ్య, కుతాడి జ్యోతి, బిజిలి శ్రీనివాస్, మానుపాటి బుచ్చయ్య, మానకొండూర్ సంఘం నాయకుడు రెవెల్లి రాజలింగం తదితరులు ఉన్నారు.

సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

కార్పొరేషన్, నవంబర్ 24: నగరంలో చేపడుతున్న సమగ్ర ఇంటింటి సర్వేకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో వేగంగా నమోదు చేయాలని నగర డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి అన్నారు. ఆదివారం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. వేగంగా సర్వే నమోదు పూర్తి చేయాలన్నారు. ఎక్కడా సమస్యలు రాకుండా, తప్పులు లేకుండా సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా లత

తెలంగాణచౌక్, నవంబర్ 24: ఎమ్మార్పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా దమ్మగళ్ల లత నియామకమయ్యారు. ఆదివారం నగరంలోని గణాంకాల భవనంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర